కథానిక

# మిత్రధర్మాలు!

రచన:
శ్రీ కె. పి. బాబు

మండు వేసవి.

మిట్ట మధ్యాహ్నం.

ఆకాశంలో కొన్ని నల్లమబ్బు తునకలు మెల్లమెల్లగా చేరి ఒక్కటై, ప్రచండ భాస్కరు నాక్రమించాయి.

చల్లని గాలులు వీచ నారంభించాయి.

సన్నని చినుకులు రాల సాగాయి.

* * *

గదిలో వీధివైపు కిటికీలో కుడికాలుంచి, దానిపై ఎడమ మోచెయ్యానించి, ఆ చేతిపై గడ్డముంచుకొని, కుడిచేత్తో సిగరెట్టు కాలుస్తూ, రాజారావు ప్రకృతిని పరికిస్తున్నాడు.

సాధారణ ప్రజకే అహ్లాదకరంగావున్న ఆ వాతావరణం - కవీ, రచయితా అయినట్టి అతనికి పులకరింపు కలుగజేయడంలో వింతేముంటుంది?...

ఆ పారవశ్యంలో మునిగి రాజారావు, రామారావు రాకని సైతం గుర్తించలేదు.

గబగబావచ్చిన రామారావు ఒక క్షణం మిత్రుని స్థితి గమనించి, పిల్లిలా దగ్గరకు పోయి భుజంతట్టి తన వైపుకి త్రిప్పుకొన్నాడు.

రామారావుని చూడగానే 'వాట్ ఎ వండర్!' అని, రాజారావు ఉత్సాహంకొద్దీ ఈలవేశాడు.

'నీపరధ్యాస రానురాను తగ్గిపోతుందనుకొనే వాళ్లం గాని, పెరిగిపోతున్నట్లుందేంరా?' అన్నాడు రామారావు మందహాసంతో.

'ఉండరా - ఉండు! అయాచితంగా ప్రకృతిలో కలిగిన మనోహరత్వానికి తోడుగా ప్రాణమిత్రుని ఆకస్మిక అవతరణం కల్గించే మనఃస్థితిని వర్ణించే మాటలు వెతుక్కొనీ! వాహ్వా...ఏం రోజు - ఏం రోజురా!'

'మాటలూ, వర్ణనలూ మీకే కరువా? ఈ మధ్య మీ బృందం సందేశాలూ, సలహాలూ కూడా ఇస్తున్నారటగా?'

'ఏం? నీకేమన్నా కావాలా, చెప్పు?' అని నవ్వి, మిత్రునికి మర్యాద లారంభించాడు రాజారావు.

'ఓ ముఖ్యవిషయంలో నీ సలహా పుచ్చుకొందామనే ఇలా దిగాను. లేకపోతే ఈ బిజినెస్ రద్దీలో మరికొంత కాలం మనం కలిసే అవకాశమే ఉండేది కాదనుకో!'

'అవునవును. ఇప్పుడు మీ బిజినెస్ బాగుందని నేనూ విన్నానులే గాని, నా సలహాయే కావాల్సొచ్చిన ఆ ముఖ్య విషయమేమిటబ్బా?'

'మరేం లేదురా- నేను మేరేజ్ చేసుకోవాలనుకొంటున్నాను!'

'దివ్యంగా చేసుకో! నాబోటి తాడూ బొంగరంలేని దౌర్భాగ్యునికైతే బెడదగాని. నీకేంబాధరా?' అన్నాడు రాజారావు.

'చేసుకోమంటావో, లేదో తెల్సుకోవాలని కాదు సోదరా, ఇంతశ్రమపడి నీదగ్గరకి పరుగెత్తుకు వచ్చింది..'

'మరి దేనికిరా?'

'వధువు విషయంలో నీ అభిప్రాయమూ తెల్సుకోవాలని!'

రాజారావు మిత్రుని ముఖంలోకి చూచి, 'ఏమిత్రా - నీ క్కాబోయే పెళ్ళాంమీద నాఅభిప్రాయాలేమిత్రా?' అన్నాడు.

రామారావు నవ్వి, 'నా మనస్తత్త్వం నీవెరుగనిదేమీకాదు గదా - అట్లానే జానకీదేవి సంగతి సందర్భాలూ నీకు బాగా తెలుసునని విన్నాను-' అంటుంటే, అడ్డుతగిలి రాజారావు, 'వధువు జానకీదేవా?' అనడిగాడు.

'అవున్రా. ఆమెను చూచే ఇటొస్తున్నాను. అంద చందాలవంటి విషయాలన్నింట్లో ఆమె మా వాళ్ళకే కాదు, నాకూ నచ్చినట్లే గాని—'

'కానీ?'

కాని—'అర్హత' అనే దాని విషయానికి నేనిచ్చే ప్రత్యేకత నీవు తెలియనిది కాదు. నా 'అర్హత' నీవు వేరే చెప్ప పనిలేదు. వాల్తూరులో నీ వున్నంతకాలం ఆమెతో బాగా పరిచయం వుండేదట నీకు కనుక ఆమె 'అర్హతలూ' తెలిసే వుంటాయి...'

'ఇంతకీ నీవ నేదేమిటో నాకేమీ బోధపడ్డంలేదు' అన్నాడు రాజారావు.

'మరేమీలేదురా - నేనూ, ఆమే ఇద్దరం నీకు స్నేహితులమే మరి మా దాంపత్యం ఎలా గుంటుందో చెప్పాలి. మా మేరేజి సెటిల్ కావడం నీ అభిప్రాయానుసారం గానే అనుకో!' అని రామారావు చెప్తుంటే, వెంటనే ఏమీ జవాబివ్వలేక పోయాడు రాజారావు.

దానకిదేవి...

జానకి...

జానీ!...

ఆ రోజులూ, ఆమె పరిచయమూ, అన్నీ - అవన్నీ స్మృతిపథంలోకి శరవేగాన ప్రవేశిస్తూ మధురానుభూతి కల్గిస్తున్నాయ్...

రామారావు 'ఏమంటావురా?' అన్నాక గాని రాజారావు తేరుకోలేదు!

'ఆగు - అలా కూర్చో కాస్సేపు' అన్నాడు. సిగరెట్టొకటి ముట్టించి, మరొకటి రామారావుకి అందించబోయాడు. అతను నవ్వి 'మళ్లీ నీవే ఓడిపోయావేరా! ఇప్పటికీ నాకలవాటు కాలేదుసుమా!' అన్నాడు.

Tel. "SANTHA" TIRUCHY Phone: 724 Factory: TIRUCHY



V. P. N.

ఒరిజినల్

శాంతా వజ్రములు

(రిజిష్టర్డు నెం. 7493)

రాయల్ స్టార్ వజ్రములు

(రిజిష్టర్డు నెం. 7494)

Prop: V. P. నరసిమ్మలు నాయుడు

షరాపు వ్యాపారం

పెద్ద బజారు :: తిరుచిరాపళ్ళి-8.

వి. పి. పి. ఆర్డర్లు వెంటనే గమనించబడును.

రాజారావూ మందహాసంచేసి. గట్టి దమ్ముకొట్టిలాగి 'సరే విను ఇక - నావు నీవు ప్రాణమిత్రుడివి., జానకి మరుపురానిది! మీ వివాహవిషయంలో ఫలానా అభిప్రాయమంటూ ఏమి చెప్పాలో అర్థంకాక తికమకగా వుంది. కనుక ఇప్పుడు నీకు, జానకితో నావుగల ముఖ్యమైన అనుభవం ఒకటి తెలియజేస్తాను. అది విన్నాక ఇక నేను చెప్పే అవసరం లేకుండానే, నీవు నీవే ఒక నిర్ణయానికి రాగలవని నా నమ్మకం' అన్నాడు.

'ఏదైనా చెప్పు వింటానుకాని రాత్రి మెయిల్‌కి నన్ను సాగనంపితే చాలు - అవతల ఇంకా బోలెడు వ్యవహారాలు పడివున్నాయ్' అన్నాడు రామారావు.

* * *

రాజారావప్పుడు వాళ్ళ బాబాయి సంరక్షణలో వుంటున్నాడు. ఆయనొక వ్యాపారస్థుడు. భార్య అక్కొడుకూ, తెలివితేటలుగల అభాగ్యుడూ అని రాజారావు ఆశ్రయమిచ్చి అభివృద్ధికి తేవాలని కృషిచేశాడాయన.

ఆయనకు తన చేతనైనంతా వ్యాపారంలో సాయపడ్తూ, తీరికవేళల్లో పత్రికలకి రచనలు గుప్పిస్తూ, అదృష్టానికి కెదురుచూస్తూ కాలక్షేపం చేస్తుండే వాడు రాజారావు.

అదృష్టానికి బదులు ఎదురింటి అమ్మాయి జానకి కన్పించింది రాజారావుకి!

ఒకనాడామె ఒక పాఠకురాలిగా పరిచయమైంది. తన రచనలూ ఆమె చదివివున్నదని తెలిసి. ఉబలాటం కొద్దీ రాజారావు 'నారచనలపై మీఅభిప్రాయం తెల్సుకోవాలని వుంది' అన్నాడు.

'నిరభ్యంతరంగానూ. కాని, మీరు నన్ను మెప్పించలేక పోయారని తెలియజేయాల్సి వచ్చినందుకు మాత్రం చాల చింతిస్తున్నాను...' అంది.

ఎంత సూటిగా, ధీమాగా చెప్పేసిందని!

ఆవయస్సులో, ఆమాత్రం చదువుతో అంత నిబ్బరంగా, నిమర్శనగా. అంత చక్కగా మాట్లాడే ఆడపిల్లల్ని అతనెరుగడు. ఉంటారనీ ఆశించివుండలేదు. అందుకే చకితుడయ్యాడు.

'మీ రింతకాలం వ్రాస్తున్న పద్యాలూ గీతాలూ కథలూ అవీ చదువుతూనే వున్నాను. కాని, మీ ధోరణీ ఏమిటో - మీ ఆశయ మేమో నా కంతు చిక్కలేదు!' అన్నది అప్పుడే.

అప్పటికి రాజారావు కేవలం ప్రణయ కవిత్వమే ప్రదర్శిస్తున్నవాడు. దాన్ని ఉద్దేశ్యించే ఆమె ఎదురొక్కన్నది.

'అట్లా రాయవద్దనిగాని, రాయకూడదనిగాని నేను చెప్పలేనుగాని, మీరు వ్రాసేదంతా నే నిదివరకే ఏవేవో ప్రబంధాలలో. కావ్యాలలో చదివేసినట్లు 'ఫీలా' తూ వుండేదాన్ని. పోతే. ఒక్కొక్కసారి మీరు వ్రాసేది వెగటుగా, జుగుప్సాకరంగాకూడా కన్పించేది. అయితే, అదంతా నా 'ఫీలింగ్స్' మాత్రమే నంటే - నేనిక చెప్పేదేమీ లేదు!'

ఆమె అలా చెప్పుకుపోతూవుంటే, నోరావళించి వింటూ వుండిపోయాడు రాజారావు...

ప్రణయంలో ఏ మాత్రం అనుభవం లేకపోవడం వల్లనో, లేక ప్రణయ కవిత్వరచనా సామర్థ్యం లేకపోవడంవల్లనో-పూర్వకవులను కాపీ చేయడమే మీపనిలాగుంది. 'కాళీదాసు కవిత్వంకొంత, తనపైత్యంకొంత' అన్నట్లుగా - ఆ కాపీవర్కుసైతం చక్కగా చేయలేకపోతున్నారని అనుకొనేదాన్ని ...క్షమించాలి!'

'కాదు, కాదు' అంటూ ఖండించాడే గాని, ఒప్పించలేక పోయాడు.

నిజంగా అదే తన ప్రథమ పరాజయం! అంతకాలం తన రచనలగురించి ప్రశంసించినవారూ, ప్రోత్సాహించినవారూ తప్ప - ఇంత నిర్మోహమాటంగా కాదుగదా, సున్నితంగానైనా విమర్శించిన వారగుపించలేదు! ఇన్నాళ్ళకి - అందులో ఒక అబల ఇట్లా ఖండించడమూ,

DEPENDABLE PLACE
*For* DELIGHTFUL
DRESS GOODS

BENARES,
BANGALORE, SAREES
BENGAL, etc.,
SILKS of EVERY STYLE HANDLOOM
COTTON SAREES, DHOTIES and
other Clothing materials.

ALL OF THE HIGHEST QUALITY

**S. R. B. Kuppuswamy Iyer &Son,**
(Formerly :—S. R. BALUSWAMY IYER & SONS)

**230, East Marret Street, Madurai.** 'Phone : 36.

**83, Nayniappa Naick Street, P. T. Madras.** 'Phone : 3506

ఆమె వాదాన్ని తాను తిరిగి ఖండించక పోవడం చాల బాధాకరంగా తోచి, ఎంతైనా కృంగిపోయాడు.

అదిన్నీ జానకి గుర్తించినట్లు కన్పించింది. తాను చేసిన పనికి నొచ్చుకొంది. అంత మాత్రానికే అతనంత బాధ పడ్డందుకు వింత చెందింది.

'అభిప్రాయాలు కోరుకొనేవారు వ్యతిరేకాభిప్రాయాల్ని సైతం నిబ్బరంగా స్వీకరించి, ఆత్మవిమర్శ గావించుకొని, పొరబాట్లుంటే ఆమోదించి, సవరించుకోవడానికీ సిద్ధమైవుండాలిగాని, ఇట్లాపొగడ్తలకోసమే ఎదురుచూస్తూ కూర్చోవడం ఏమాత్రం అభ్యుదయకరం గాదేమో?' అంది మెల్లగాను...

'అదిగో - మీ రంగు యిప్పుడు తేలిపోయింది సుమాండి! మీరభ్యుదయవాదులు కాబట్టే, నా కవిత్వ వస్తువు ప్రణయమని ఇట్లా నిరంకుశంగా ఈసడించి పారేస్తున్నారు...' అన్నాడు, తేరుకొని.

ఆమె ఫకాలున నవ్వింది.

ఆ నవ్వు...అది ఎంత ఆకర్షణీయంగా, మనోరంజకంగా వుందని!

జానకిలోవున్న అద్భుతమల్లా అలా చీటికి మాటికి ప్రదర్శించే ఆమందహాసంలోనే వుందేమో అన్పించేది...

'మీరొట్టి అమాయకుల్లా కన్పిస్తున్నారే! నాకు తెలియక అడుగుతాను - ఏం, మీరభ్యుదయాన్ని వాంఛించరా? పోనీ, అభ్యుదయాన్ని నిరసించేవారిని ఏమనుకోవాలి? చెప్పండీ...'

'అభ్యుదయమంటే - ఆకలి, దారిద్ర్య బాధలూ, బరువులూ వర్ణించడమేనా?' అన్నాడు, కసిగా.

'కాదు' అంది చటున. 'కాని, కాపీకొట్టడమూ, అనుభవ శూన్యంగా నిస్సారమైన కవిత్వం వ్రాసి, దాన్నే ప్రచారం చేసుకోవాలని ప్రయత్నించడమూ అభ్యుదయ లక్షణాలేమీ కావుగదా?'

'ఇలా కొన్ని రోజులు...నిత్యం కల్సుకొని వాద ప్రతివాదాల్లో మునిగి తేలడం సంభవించింది...

చివరికి-వారిద్దరిలో ఎవరు ఓడారు, ఎవరు నెగ్గారు అన్న సమస్యే లేకపోయింది. ఎందుకంటే అప్పటికి వాళ్ళిద్దరూ అత్యంత సన్నిహితులై పోవడం జరిగింది!

అప్పటికి జానకి చదువుతున్నది స్కూల్ ఫైనలే అయినా తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలు ధారాళంగా చదివి. అర్థం చేసుకొనేది. మాట్లాడేది, వ్రాసేదికూడా!..

రాజారావుకి పాపం, మాతృభాషా జ్ఞానమున్నా సమగ్రంగా లేదని పసిగట్టి జానకి అనేక పుస్తకాలు-ప్రపంచ ప్రసిద్ధి చెందిన రచయితలవి-తరచుగా చదివి, అతనికి చెప్తుండేది.

సాహిత్యసభలు. కళాప్రదర్శనాల్లో పాల్గొనడం - సినీమాలు చూడ్డం బాగా అలవాటూ మెకి. అవంటే ఇష్టం లేక కాదు గాని, ఆర్థిక లోపం మూలంగా రాజారావు అటువంటివాటికి దూరదూరంగా వుంటూ వుండేవాడు. తాను కలిశాక, జానకి ఇక అటువంటి కార్యక్రమాలకి ఒంటరిగా హాజరు కావడం విరమించింది. ఎప్పుడూ రాజారావు ఆమెతో కన్పించేవాడు.

అప్పటినుండి రాజారావు రొమ్మువిరుచుకు తిరగడం తగ్గించాడు తన రచనలే కళాఖండాలని వాదించడం మానేశాడు తన్ను ప్రోత్సహించని వారిని అభ్యుదయ విరోధులనీ, ఈర్ష్యాలువులనీ; పేరులో వున్నవారిని ప్రాపకాలమూలంగా మాత్రమే ఆట్లా పేరుకొచ్చారనీ అనడమూ విరమించాడు!

జానకి పరిచయంతో రాజారావులు ఎంతైనా మార్పు వచ్చినట్లు గుర్తించిన మిత్రులు సంతోషించే బదులు అసూయ పడ్డారు.

ఎటువంటి యువకుల్నీ చేరనివ్వని ఆమె, ఇటువంటి రాజారావుకి అత్యంత సన్నిహితురాలు కావడమే అందుకు కారణం!

ఎదురుగానైతే వేళాకోళాలతో చాటుగానైతే స్కాండర్స్‌తో తమ 'కసి' తీర్చుకోడానికి తగ్గలేదు!...

అందుకు రాజారావు ముందేమి జరుగుతుందో. ఏమో అని భయపడేవాడు, కాని జానకి మాత్రం అట్లానే తెగించి తిరిగేది!

అటువంటి జానకికి పెళ్ళిప్రయత్నాలు జరుగుతున్నాయనీ, ఆ విషయంలో జానకి తల్లిదండ్రుల యాజ్ఞ అనుశిరసావహించనున్నదనీ తెల్సినప్పుడు రాజారావుకి దిగ్భ్రమ కల్గింది...

ఆమె 'నిన్నే ప్రేమిస్తున్నా' ననిగాని, 'నిన్నే పెళ్లాడుతా' ననిగాని ఎన్నడూ చెప్పలేదు. కాని, అంతకు మించినట్లే ప్రవర్తిస్తూ వచ్చిందే! అటువంటి జానకి ఇంతలో ఇట్లా మారిపోవడమేమో!...ఆ బెంగతోనే మంచమెక్కాడు రాజారావు...

ఆ సంగతి తెల్సి పరుగెత్తుకొచ్చింది జానకి.

'జానీ...జానీ!' అన్నాడు గొణుగుడుగా. 'ముక్కూ-ముఖం ఎరుగని పరాయివాడెవడికో పెళ్ళామైపోవడానికి ఇష్టపడ్తున్నావటగా?'

జానకి చాల తేలిగ్గా, తమాషాగా నవ్వింది. 'అవును రాజా! తమ కన్నకూతురి జీవితాన్ని, తెలిసీ నరకంలోకి త్రోసేటంత అధములుకారు, మా అమ్మా నాన్నా! ఆ నమ్మకం నాకుంది గనుకే, వారి పర్యావేక్షణకిగాని, వారికిగాని. వారికినచ్చినవాన్ని పెళ్లాడ్డానికిగాని అడ్డంకి పెట్టదల్చుకో లేదు!' అన్నది.

'కావచ్చుకాని, జానీ...గతుకులబాటల్లోపడి ఎట్లో పోతువున్న అమాయకుడ్ని ఒక రాజమార్గంలోకి తెచ్చి వదలడానికింత శ్రమించీ, ఆకర్షించీ, అండగా నిలుస్తావన్న ఆశా కల్గించి—చివరికి—ఇప్పుడు...ఇప్పుడు...' ఆపైమాటలేమో పెగల్లే లేదతనికి.

'అదిగో, అక్కడే పప్పులో కాలేసేది మగాళ్లు!' నిన్ను ఓమార్గంలోకి తేవాలనే నా ఆశయం! అది తీరి పోయిందనే నమ్ముతున్నాను. ఇక నాదారి నేను చూచు కొంటూవుంటే. నీవేదో పాడిగించాలని చూస్తున్నావ్- అది సబబుకాదు గనుకే ఇంతబాధా పడ్తున్నావేసుమా!' అందామె.

'ఎంతమాటన్నావ్ జానీ, అలా అనకపోతే 'నీవు నాకు తగవు పోరా' అని ఒక్కముక్కలో చెప్పెయ్య రాదా! అదే నిజంకూడా కన్పిస్తోంది!' అనేశాడు వెంటనే.

జానకి బాధగా చూచింది; బరువుగా నవ్వింది.

'పిచ్చి రాజా! సరిగ్గానే చెప్పావు కనుక ఒప్పుకొం టున్నాను. కాని, ఆమాట నా నాటిమీదే అన్పిస్తావని మాత్రం కలలోకూడా భావించలేదు సుమా! దూరాలో చన చేసుకొని, బుద్ధిమంతుడవనిపించుకొని నీవూ సుఖ పడ్తావనుకొన్నాను. ఇప్పటికైనా మించి పోయిందేమీ లేదు - ప్రశాంతంగా ఆలోచించుకో, నీకే అన్నీ బోధ పడ్తాయ్!' అని వెళ్ళిపోయింది...

జానకి మనస్తత్వం ఎటువంటిది? ఆమె ఆశలేమిటి? ఊహలెటువంటివి? ఆమె అనిపోయిన మాటల్లోని భావ మేమిటి? - ఇవే తర్కవితర్కాలతో మునిగిపోయాడు, కొన్ని రోజులు...

ఆమెగూడా మధ్యతరగతి కుటుంబీకుల పిల్లే! కాని, వివాహానంతరంకూడా ఈ త్రిశంకు స్వర్గజీవితాన్ని వాం ఛించేదేమీకాదు! అందుకే ఊ ప్రేమలూ, ఆదర్శాలూ, సంస్కరణలూ, వాటికై సమరాలూ ఆమెకంత ఇష్టం కానట్లున్నాయ్!

ఏదో 'ఇంత' పెళ్లాం పిల్లల్ని సుఖంగా బ్రతికించే వాడితో, సామాన్య గృహిణీ జీవిత మనుభవించగల్గినా చాలు - అదే పదివేలు అనుకొనేది!

మా కాతాదారులకు, అభిమానులకు, మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనములు::

బాలురు మొదలు వృద్ధులవరకూ
స్త్రీ. పురుషులందరుకూ పూర్ణతృప్తినిచ్చు మా

తంతి: YENKAYCEE. ఫోన్: 199
"నటరాజా" బనియనులు
ఆకర్షణకు, ఆకారమునకు మన్నికకు శ్రేష్ఠమైనవి
TRADE N.K.C MARK
తయారుచేయువారు:
నటరాజా నిట్టింగ్ కంపెనీ,
74, కుమరన్ రోడ్డు, తిరుప్పూర్

ఆంధ్రకు, ఒరిస్సాలకు సోల్ ఏజంట్లు :—
ఓరియంటల్ టెక్స్ టైల్ ఏజన్సీస్. రాజమండ్రి

జీవితంలో ఏవో కొన్ని ఆదర్శాలతో పట్టి అప్రయోజకుడై, పరాయికొంపల్లో పడి బ్రతకాల్సివస్తున్న తనవ అట్టిది అర్ధాంగి అయితే, ఆమె పొందే సుఖమేమిటి? అప్పుడు తనకి కలిగే తృప్తిమాత్రం ఏమిటి?...

కాని...కాని...జానకి మరపు రానిదై పోయింది! మరువలేనిదై పోయింది! మధురాతిమధురమైందే!...

ఒక్కసారిగా ఆమె వియోగాన్ని సహించడం అసాధ్యమైన విషయంగా తోచింది.

అంతలో మళ్ళీ ఒకసారి పరామర్శకి వచ్చింది,జానకి.

అప్పటికింకా మంచంమీదే పండుకొని ఆలోచిస్తున్నాడు, రాజారావు.

ఆమెరాగానే మంచంమీదకూర్చోమని సైగ చేశాడు. ఆమె అట్లానే కూర్చుని మామూలుగానే కుశలప్రశ్నలు వేసింది.

వాటికేమీ జవాబు లివ్వకుండానే రాజారావు జానకి కళ్ళల్లోకి చూస్తూ 'జానీ ... ఆశించింది పూర్తిగా విఫలమైపోతే, నాబోటి దుర్బలుడేమైపోతాడో నీకు తెలుసా జానీ?' అనడిగాడు సూటిగాను.

జానకి ముఖం చాటుచేసుకొంది.

మెల్లగా ఆమెను తనవంకకి త్రిప్పుకొంటూ. 'ఏమైనా కాని నువ్వుగాని జానీ...నీ శ్రేయస్సునాశించి, నాకోర్కెల్ని చంపేసు కొంటున్నాను...కాని—జానీ! ఇప్పుడు నాలో ప్రారంభమాతున్న ఆవేదనాజ్వాలలు తగ్గించేందుకెవరన్నా ఇంత సాయంచేస్తారా జానీ, కల్ల!' అన్నాడు నిట్టూర్చి.

అతని నిర్ణయం ఎంత ఆనందకరమైందో, అతనిస్థితి అంత హృదయ విదారకంగా తోచిందామెకు. గభాలున అతని గుండెలపై చేతులేసి, మృదుస్వరాన 'రాజా! నీ వ్యక్తిత్వం నాకు తెల్సు నీవుపడే బాధా తెల్సు! నా సుఖంకోసం నీవుచేసే త్యాగానికి, తగిన కృతజ్ఞత చూపుకోలేననుకొంటున్నావా?' అంది.

రాజారావు ఆమె చేతుల్ని తీసివేస్తూ, వికటంగా నవ్వాడు -' కృతజ్ఞత! కృ-త-జ్ఞ-త! జానీ, మనిషైన వాడికి కనీసంగా నన్నా తృప్తి కావాలిగాని, ఈ కృతజ్ఞతలేమి మనశ్శాంతి నిస్తాయ్ జానీ?' అన్నాడు.

'నాకీ సమయంలో తృప్తికల్గించే దొక్కటే- కాని, అదినాకు నేనై చెప్పలేను. ఎందుకంటే, నీవది నాకు కల్గించలేవు! ఇక అదీకాదన్పించుకొని గావడమేంఖర్మ? జానీ, వెళ్ళు నీవైనా సుఖించు' అని ముఖం త్రిప్పేసుకొని, దుప్పటికప్పేసుకొన్నాడు.

జానకి విస్తరపోయింది...ఆమె తేరుకొనేసరికి దుప్పటిలోనుండి రాజారావు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు జోరుగా విన్పిస్తున్నాయ్! ... లేచి, గజగబా వెళ్ళిపోయింది.

* * *

ఆ మరునాటి సాయంత్రం...

పిన్ని గుడికివెళ్ళింది బాబాయి వూళ్ళో లేడు. పనిమనిషి వచ్చి వెళ్ళిపోయింది.

వెనుకగదిలో కిటికీగుండా రాజారావు పెరట్లోని సంధ్యారాగాన్ని చూస్తూ, సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ, ఏకాంతంగా భావిగతిని గురించి చింతిస్తున్నాడు.

హఠాత్తుగా జానకి వచ్చింది!

'మీ పిన్నిగారు గుడికి వెళ్ళినట్లున్నారే?' అంది నవ్వుతూనే.

వెనుదిరిగిచూచి చకితుడయ్యాడు రాజారావు. నిన్నటితో ఇక జానకి కలయిక మళ్ళీ జరుగదనుకొంటూ వచ్చాడు. కాని, జానకి మామూలుగానే మళ్ళీవచ్చిందే! పుండుకెలికి బాధించడానికేమో?...

'ఏం, అలాచూస్తావ్?' అంటూ చనువుగా దగ్గరచేరి 'ఇదిగో ఎట్లా చావాలా అని ఆలోచిస్తున్నావా, కొంపదీసి?' అంది.

'నీవు కృతజ్ఞతకాదు, తృప్తికావాలిగదూ? కనీసు తృప్తికల్గించినా కోలుకొంటావు గదూ?'

'ఇదుగో జానీ. చచ్చినపాము నింకా కొట్టావేం?'

'ఛా! ఊరుకో మరీనూ, ఆడపిల్లలా!' అందామె.

Tel : "FOUNDRY" Phone : 535



# MONOBLOCK SET

మావద్ద తయారైన నవీన మోనోబ్లాక్ పంపుసెట్టు

ఇతర తయారింపులు సెంట్రిప్యూగల్ పంపులు

1. మోటారు జతలో చేర్చబడినది
2. బెల్ట్ డ్రివన్
3. చెరుకు ఆడెలు
4. గన్ మెటల్ వాల్వులు

5, H. B. ఎస్. ఎఫ్. మోటార్సు రెడి స్టాక్ వెల రు. 500

## సుబ్బయ్యా ఫౌండరి

పాపనాయకన్ పాళ్యం : : కోయముత్తూరు

బ్రాంచి నెం. 21, లింగిచెట్టి వీధి, మదరాసు-1.

ఏజంట్లు:—

శ్రీ ఎస్. జె. దాస్ (ఎస్. ఎఫ్. రెప్రసెంటేటివ్) న్యూపెట్, చంద్రగిరి (చిత్తూరుజిల్లా.)


'నాకై నీవు చేసిన త్యాగం, పడేబాధా సామాన్య మైంకాదు! కాని, అందువల్ల నీవు పాడైపోవడం నాకే మాత్రం ఇష్టంకాదు. తెలుసా?. అని ఆగింది.

'నాకు తెలుసు - నీ మనసులోని ఆ చివరికోర్కె ఏమిటో! కాని...కాని-',

రాజారావుకేవో క్రొత్త ఆశలు చివురించాయి, 'కానీ ఏమిటిజానీ!' ఒక్కసారి - యావజ్జీవితం మరుపురాని మధురానుభూతి - ఒక్క సారి నీతో నేను పొందగల్గితే—అ...బ్బ! దానికి మించిన తృప్తి నాకేముంటుందిక?' అంటూనే ఆమె దగ్గర అడుగేశాడు.

'ఓయి పిచ్చిరాజా! మొత్తానికెటువంటి వింతమనిషి వోయ్!' అంటూ ఆమెకూడా అతని దగ్గరయ్యింది. మందహాసంతో.

తిరిగి ఇంటికి వెళ్లేముందు జానకితో రాజారావు 'భగ్నమౌతూన్న బ్రతుక్కి జీవంపోశావేజానీ, నీఋణం తీర్చుకోలేను!' అన్నాడు.

జానకి నవ్వుతూ' అదేమిటీ ఇందులో జీవాలూ, ఋణాలు ఉన్నాయా, నాకు తెలియదే! లోకంలో స్నేహాన్ని మించింది లేదు. దానికోసం చేసే ఏపని తప్పుకాదని భావిస్తాను. నా స్నేహం ధర్మం 'నేను నెరవేర్చుకొన్నా ననుకొంటున్నానంతే!' అని వెళ్ళిపోయింది...

*　　*　　*

'—ఇదీ కథ! ఆ తరువాత నేనిట్లా బాబాయిని వదిలి దేశంమీదపడ్డం జరిగిందనుకో. అప్పటికి జానకికి వివాహం జరుగలేదని తెల్సు కాని, ఇప్పటికీ ఆమె అవివాహితగానే వుందని నీ మూలంగా మాత్రమే తెల్సుకొన్నాననుకో?' అని ముగించి మరో సిగరెట్టు ముట్టించాడు రాజారావు.

నోరావళించి వింటూన్న రామారావు చాలసేపు తేరు



కోలేదు. చివరికి, 'ఇంతకీ నీవేమంటావురా?' అనడిగాడు మందస్వరాన.

'ఏముందీ? జానకి వ్యక్తిత్వం నీబోటి ప్రాణస్నేహితునికి వివరించాలంటే, ఈ తెరచాటు ఘటన చెప్పనిదే వీలుకాదని జరిగినదంతా మనస్సువిప్పి చెప్పేశాను. ఇలా చెప్పానని ఆమెని వీచపర్చుకోకూడదు సుమా!...

'ఒక కళాఖండం వస్తుతః తనదే అయినా తన ఒక్కనిదేకాదు, దాన్ని గుర్తించే వారందరికీ అది ఆనందం కల్గించేదే అని గ్రహించి, దాన్ని ఆనందించేవారిలో తానూ ఒకడు మాత్రమే ననుకొని ప్రవర్తించగల వ్యక్తి వంటివాడు మాత్రమే జానకివంటి అపూర్వవ్యక్తికి భర్తగా, ఏ చీకూ చింతా లేకుండా కాలక్షేపం చేయగలడు అంతే!' అని ముఖం వీధివంకకి త్రిప్పుకొన్నాడు రాజారావు.

రామారావు భారంగా లేచాడు. 'అవున్రా! ఆమె ఎటువంటిదైతే మన కెందుకు..మనం క్షేమంగా సుఖంగా జీవించగలమా లేదా అనేది మాత్రమే నాకొక్కవలసింది! అది చక్కగా తేల్చేశావు - ఊబిలో కూరుకుపోనున్న వాడికి చేయందించి సాయపడ్డ నీ ఋణం ఎట్లా దీర్చుకోవాలో అర్ధంకావడం లేదురా!' అన్నాడు.

రాజారావు చిరునవ్వుతో, 'దీన్లో ఏం బ్రహ్మాండం వుందనిరా? 'నా మిత్రధర్మ' నేను నెరవేర్చుకొన్నానంతే! అన్నాడు...

* * *

నాటి సాయంత్రమే తుంపరలు ఆగిపోయాయి.

ఆకాశం నిర్మలంగా వుందా రాత్రి.

పుచ్చపువ్వు లాంటి వెన్నెల...

కాని, ఎక్కడా ఆప అల్లాడంలేదు. ఇందాకటి చినుకులలోనుంచి సెగలు, పొగలు ఉద్భవిస్తున్నట్లు సతమతమవుతోంది, భూమి...

★

శ్రవ్య నాటిక :

# పాద పల్లవ బంధనం

– రచన : రూపాబాయి మోతీలాల్ –

●

పాత్రలు :—

1. విజయరాఘవ నాయకుడు—
2. రాజగోపాలాంచిక—
3. రంగాజమ్మ—
4. హేమాంగిని—

(ఇందులోని పద్యములు విజయరాఘవ నాయకుని ఆస్థాన కవయిత్రియైన రంగాజమ్మ విరచితములు.)

♦♦♦

రాజ : హేమా, ఎందుకింత ఆలస్యం? ఎప్పటినుండి నీ రాకకై నిరీక్షిస్తున్నానో తెలుసా? ఊఁ....రంగాజికి బుద్ధి గర్పించావా? నా మందలింపులకు ఆ వారాంగన లజ్జజెందెనా?

హేమా : దేవీ తమరు సెలవిచ్చినట్లే మందలించాను. కానీ....

రాణి : కానీ... ?

హేమా : ఆ చతుర తన చమత్కృతీ భాషలతో నన్నే ఉక్కిరి బిక్కిరి చేసిందమ్మా.

రాణి : నా దూతికవైన నీతోనే మర్యాదలేక ప్రవర్తించిందా? ఎంత గర్వం.

హేమా : మహారాజుల అభిమానానికి పాత్రమైన ఆవిడ గర్వానికి అంతే లేకున్నది దేవీ. నేనామె సౌధానికి వెళ్లినసమయంతో సర్వాలంకార భూషితయై నిలువుటద్దం ముందర అభినయ ముద్రతో నిలచి తన ప్రతిబింబాన్ని చూచి తనే మురిసిపోతూ, ఆ రంగాజమ్మ...